క్లుప్తంగా

నేడు శంకర జయంతి

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో శంకర జయంతి ఉత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈఓ జయంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ అర్చక స్వామి, గుమస్తాను సంప్రదించాలని కోరారు.

మేజర్ జయసుధ చౌదరికి డాక్టరేట్



కాచిగూడ: ప్రముఖ సంఘ సేవకురాలు, ఎన్‌సీసీ ఆఫీసర్, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ జయసుధ చౌదరికి 'ఇండో ఇజ్రాయిల్ ఫ్రెండ్‌షిప్ నేషనల్ అసోసియేషన్', అమెరికా మెషిసిప్పిలోని డే స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ నుంచి సామాజిక సేవారంగంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆమె సామాజిక సేవారంగం, జాతీయ సమైక్యత, మతసామరస్యం, పర్యావరణ పరిరక్షణ, క్రీడారంగం, శాంతి, మహిళా సంక్షేమాభివృద్ధి తదితర రంగాల్లో గత 20 ఏళ్లుగా నిరంతరం అందిస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. యూనివర్సిటీకి చెందిన ఇండియా డైరెక్టర్ డాక్టర్ అమోస్‌జెమ్స్ చేతుల మీదుగా మేజర్ జయసుధ డాక్టర్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా ఇండో ఇజ్రాయిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఆడం రాజ్ దిక్కపతి, సినీనటుడు రాజా, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్ తదితరులు ఆమెను ఈ సందర్భంగా అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మల్లికార్జున్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌ను సమస్యల రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుతానని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ ప్రత్యేకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం డివిజన్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో అన్ని విభాగాల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ నోడల్ అధికారిణి రజిత, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఈఓ దేవనాథం, అర్చకులు, భక్తులు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి దేవాలయం హుండీని సోమవారం లెక్కించగా రూ.1,98,283 ఆదాయం లభించింది. ఆలయ ఈఓ ఎం.దేవనాథం, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖల పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి రావడంతో నెల రోజులకు హుండీని లెక్కించగా రూ.1, 98,283 ఆదాయం వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక భావనను పెంపొందించడమే తమ ధ్యేయమన్నారు. ఆలయ అర్చకులు బుగ్గలక్ష్మిపతిశర్మ, ఆచార్యులు, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సినీగీత లాహిరి



శ్వేయను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: సౌజన్య ఫౌండేషన్ నిర్వహణలో ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకి 85వ జన్మదినోత్సవం సోమవారం రాత్రి మహాలక్ష్మి మెలోడీస్ పేరిట సినీగీత లాహిరి జరిగింది. మహాలక్ష్మి, సంధ్య, శ్రీనివాస్, మూర్తి, వినయ్, భాను, సింసన్ తదితరులు జానకి, బాలసుబ్రహ్మణ్యం పాడిన పలు యుగళ గీతాలను గానం చేశారు. కళా పోషకులు మురళీధర, రామమూర్తి, జే.పీ.శేఖర్, సంతోష్, రవికుమార్‌లు అతిథులుగా పాల్గొని శ్వేయను బాలనాట్యమయూర బిరుదుతో అభినందించారు.



కృష్ణానగర్ వద్ద నాలాలో పేరుకుపోయిన చెత్త

నాలా.. ఇలాగేనా..?

జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం మూసీ నాలా పరిసర ప్రాంతాల ప్రజలకు శాపంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా.. నాలాల దశ మారడం లేదు.

- నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు
- ఆందోళన చెందుతున్న స్థానికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



హరాస్‌పెంట హిందూ స్మశానవాటిక వద్ద ఇలా..

కాచిగూడ: గోల్నాక డివిజన్ కృష్ణానగర్, సుందర్‌నగర్, నెహ్రూనగర్, హరాస్‌పెంట, శాస్త్రీనగర్, సంజయ్‌గాంధీనగర్ తదితర బస్తీల్లోని నాలాలు వ్యర్థాలతో నిండిపోయాయి.

- ఏళ్లు గడుస్తున్నా నాలా అభివృద్ధికి నోచుకోవడం లేదని నాలా దుస్థితిపై స్థానికులు అధికారులనే బాధ్యులుగా చేస్తున్నారనే విమర్శలున్నాయి.
- నాలాలో వ్యర్థాల డంపింగ్ కాకుండా చూడాల్సిన బాధ్యతను అధికారులు విస్మరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఈ ఏడాదికి ఓసారి గట్టిదనం లేని ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న అధికారులు ఫెన్సింగ్ ధ్వంసమైనా పట్టించుకోవడం లేదు. పలువురు రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలను తీసుకొచ్చి నాలాలో డంపింగ్ చేస్తున్నారు.
- నాలాలో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోవడంతో నాలాల్లో నీరు ఒక్క ఇంచు సైతం ముందుకు కదలడం లేదు. నాలాలో నీరు పూర్తిగా నల్లగా మారి దుర్గంధం వెదజల్లుతోంది.
- నాలా పరిసరాల ప్రజలు తాము దుర్గంధంతో సావాసం చేస్తున్నామని చెబుతున్నారు. వర్షాకాలంలో నాలా పొంగిపొర్లుతూ.. తమ ఇళ్లలోకి వరద చొచ్చుకు వస్తోందని స్థానికులు వాపోతున్నారు.
- నాలాకు ఎత్తయిన ప్రహరీ నిర్మించి ఫెన్సింగ్ వేసి వరద నీరు పొంగకుండా చూడాలని ముందుగా నాలాలోని వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల పెరుగుదలతో రోగాలు..

నాలాలలో పూడికతీతను చేపట్టకపోవడంతో పరిశుభ్రత కొరవడి దోమల పెరుగుదలకు ఆస్కారం ఏర్పడుతోంది. నాలాల్లో నెలల తరబడి పూడికతీతలు చేపట్టకపోవడంతో కొట్టుకు వచ్చిన చెత్త, చెదారాలు దుర్గంధభరితంగా మారింది.

- నాలాల్లో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అధ్వాన్న స్థితికి చేరుకున్నాయని పలు నాలాల్లో దుర్గంధ పూరిత పదార్థాలు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.
- దోమకాటుకు మలేరియా వ్యాధి బారిన పడాల్సి వస్తోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- పలు నాలాల్లో పేరుకుపోయిన పూడికను తీసివేయాలన్నారు. నాలాలకు కంచె లేకపోవడంతో ప్రజలు చెత్తను నాలాల్లోనే వేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'మూసీ పరివాహక ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశారు'



మాట్లాడుతున్న దొంతి నర్సింహ్మారెడ్డి, జీవన్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మూసీ పరివాహక ప్రాంతాన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల కో- ఆర్డినేటర్ జీవన్‌కుమార్ విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ కలుషితమవుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలో వివిధ నగరాల్లో కొనసాగుతున్న నగర్, నది అభివృద్ధి ప్రాజెక్టు, పరిశోధన రిపోర్టులో భాగంగా మూసీనది హైదరాబాద్ రిపోర్టును పీపుల్స్ రిసోర్సెస్ సెంటర్ స్వచ్ఛంద సంస్థ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం రిపోర్టును విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. మూసీనది రోజురోజుకు తన ఉనికిని కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నది సుదీర్ఘకాలంగా పర్యావరణ సమస్యలతో పోరాడుతోందని పర్యావరణవేత్త దొంతి నర్సింహ్మారెడ్డి అన్నారు. మూసీలోని కాలుష్యం కారణంగా దిగువ ప్రాంతాల్లో పంటలు దెబ్బతింటున్నాయని పిట్టల శ్రీశైలం చెప్పారు. ప్రాంత ప్రజలకు రకరకాల చర్మవ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పరిశోధకులు సంజీవ, పీపుల్స్ రిసోర్స్ డైరెక్టర్ రాజేంద్రరవి తదితరులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ పథకానికి విశేష స్పందన



తిప్పర్తి యాదయ్యకు ఆస్తిపన్ను చెక్కును అందజేస్తున్న వీఎస్‌టీ ప్రతినిధులు

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ ప్రకటించిన ఎర్లీ బర్డ్ పథకానికి మంచి స్పందన లభిస్తుంది. ఇప్పటికే ఎంతో మంది ముందస్తుగా ఆస్తి పన్నును చెల్లిస్తుండగా.. తాజాగా వజీర్ సుల్తాన్ టొబాకో వీఎస్‌టీ కంపెనీ ఎర్లీ బర్డ్ పథకం కింద రూ.33,05132ల ఆస్తిపన్ను చెక్కును సోమవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు అందజేశారు. ఏఎంసీ హుస్సేన్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, దేవేందర్, బిల్ కలెక్టర్ ప్రవీణ్, రోహిత్ తదితరులున్నారు.

నగర పోలీస్ కమిషనర్‌కు ఆహ్వానం

ముషీరాబాద్: మాజీ హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి పేరు మీద నిర్వహించే నాయిని మెమోరియల్ క్రికెట్ లీగ్–2 పోటీల ఫైనల్ మ్యాచ్‌కు హాజరై విజేతలకు బహుమతులు అందజేసేందుకు రావాల్సిందిగా నగ పోలీస్ కమిషనర్ సీ.వీ.ఆనంద్‌ను క్రికెట్ పోటీల నిర్వహకులు, నాయిని అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం కమిషనర్ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఆర్గనైజర్లు కార్తీక్‌యాదవ్, సిద్ధు, నాయిని పృధ్వీరెడ్డి తదితరులున్నారు.



నగర కమిషనర్ సీ.వీ.ఆనంద్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రూ.13.75 లక్షలతో అభివృద్ధి పనులు



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

చిక్కడపల్లి: ముషీరాబాద్‌లో తాగునీటి, సీవరేజ్ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. గాంధీనగర్ డివిజన్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ పంచముఖ హనుమాన్ దేవాలయం వద్ద రూ.13.75లక్షలతో నిర్మించే తాగునీటి పైప్‌లైన్, ఎల్లయ్య బస్తీలో రూ.2లక్షలతో నిర్మించే సీవరేజ్ పైప్‌లైన్ పనులను సోమవారం డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఏడాదికాలంగా తాగునీటి పైప్‌లైన్ మంజూరు కోసం కృషి చేశామన్నారు. ఈ పైప్‌లైన్ ఏర్పాటుతో చిక్కడపల్లి వాసులకు లో ప్రెషర్ నీటి సమస్య తగ్గిపోతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వినయ్, ఉమేశ్, శ్రీకాంత్, యాదగిరిగౌడ్, ఆనంద్, జైసింహా, రాకేష్‌కుమార్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, నరేష్, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్ తదితరులున్నారు.

27న రవీంద్రభారతిలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 27న రవీంద్రభారతిలో శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఉత్సవాల పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం సగరులకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఉప్పరి శేఖర్ మాట్లాడుతూ ఈ నెల 27న రవీంద్రభారతిలో నిర్వహించనున్న భగీరథ మహర్షి జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మంత్రులు గంగుల కమలాకర్, కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భూపేష్‌సాగర్, పల్లవి, సత్యం, రాములు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోటాలోని ఉద్యోగాలను భర్తీ చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్' జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం వల్ల అనేక మంది వయో పరిమితి పెరిగి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కనీసం నిరుద్యోగభృతిని కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మోటారు వెహికిల్, 4జీ మొబైల్ తదితర పరికరాలను కూడా అరకొరగా పంపిణీ చేశారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో వందకు 90 శాతం మందికి చదువున్నా.. లేకున్నా.. ఈ -పరికరాలను పంపిణీ చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డిసెంబర్ 3న జరిగే 'వికలాంగుల దినోత్సవం' నాటికి తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. వికలాంగుల కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆ కమిషన్‌కు చైర్మన్, సహ సభ్యులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రేపు హాథ్ సే హాథ్ జోడో యాత్ర

కాచిగూడ: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 26న బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంబర్‌పేట నియోజకవర్గంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహిస్తున్నట్లు టీ పీసీసీ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఫరీద్ తెలిపారు. ముఖ్య అతిథిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ ఎంపీ హనుమంతరావు, రాములునాయక్, డాక్టర్ రోహన్‌రెడ్డి, బొల్లు కిషన్, జ్ఞానేశ్వర్‌గౌడ్, నారాయణస్వామి, లక్పతి యాదగిరి గౌడ్, ఎస్.శ్రీకాంత్‌గౌడ్, రమేష్ బాబు, మోత రోహిత్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి బైబిల్ పాఠశాల తరగతులు

చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోను చర్చిలో 12 రోజుల పాటు పిల్లలకు, యువతీ యువకులు ప్రత్యేక బైబిల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు హెబ్రోన్‌ను సొసైటీ చైర్మన్ జోసెఫ్ కురియన్, ప్రధాన కార్యదర్శి రాగి పీటర్ వీరాచారిలు తెలిపారు. మంగళవారం సాయంత్రం గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వేసవి సెలవుల్లో ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లు ఈ ఏడాది కూడా విరామ బైబిల్ పాఠశాలను నేటి నుంచి మే 6 వరకు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జంట నగరాల్లో పిల్లలు, యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ కార్మికులకు పే స్కేల్ అమలు చేయాలి

లాలాపేట: తెలంగాణలోని ఆర్టీసీ కార్మికులకు 30 శాతం తగ్గకుండా పే స్కేల్ అమలు చేయాలని టీఎస్ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం తార్నాకలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగుల బేసిక్ పే అటెండర్‌కు రూ.10,880 ఉండగా పక్క రాష్ట్రం ఏపీలో అదే అటెండర్‌కు రూ 20 వేలు బేసిక్ పే ఉందన్నారు. తెలంగాణలోని ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సీఎం కేసీఆర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

అధికారుల బృందానికి సమస్యలు ఏకరువు



సమస్యలు తెలుసుకుంటున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా బస్తీల చెంతకే అధికారుల బృందం వెళ్లింది. ఈ క్రమంలో సోమవారం కాచిగూడ డివిజన్ మోతీమార్కెట్, సునార్‌లేన్, అంబలిగల్లీలో జీహెచ్‌ఎంసీ, ఎలక్ట్రికల్, యూసీడీ, పారిశుద్ధ్య విభాగం, జలమండలి, వీధిదీపాల విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతుకుల రోడ్లు, తాగునీటి సరఫరా సరిగ్గా లేదని పలుచోట్ల సీవరేజ్ పైప్‌లైన్‌లు లీకవుతున్నాయని ఫిర్యాదు చేశారు. అవసరమైన చోట్ల కొత్తగా కరెంటు స్తంభాలు వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేదని స్వీపింగ్ నిత్యం చేపట్టాలని కోరారు.

- దోమలు విజృంభిస్తున్నాయని ఫాగింగ్ చేపట్టాలని కోరారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని వీటికి స్టెరిలైజేషన్ చేయాలని రోడ్లపై స్పీడ్ బ్రేకర్స్ వేయాలన్నారు.
- అధికారులు కొన్నింటినీ అక్కడికక్కడే పరిష్కరించి మరికొన్నింటికీ ప్రతిపాదనలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ సూచించారు.
- రోడ్లపైన చెత్తవేస్తే రూ.1000 వరకు జరిమానా విధిస్తామని ఇంటింటికీ చెత్త సేకరణకు వచ్చే ఆటో ట్రాలీ సిబ్బందికి మాత్రమే చెత్తను అందించాలని కోరారు. నోడల్ అధికార బృందం ప్రతినిధులు దినేసిల్, తిరుపతి నాయక్, గ్రేసి, అమరేశ్వరి, విష్ణు, దేవా, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, బీమ్‌రాజ్, సూరి, రాము, శాంతాబాయి, సుజాత, ఎస్.రవియాదవ్, ఓంప్రకాష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి భక్తి సంగీత శిక్షణా తరగతులు



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న గౌరీభట్ల లక్ష్మణమూర్తి

నల్లకుంట: నల్లకుంటలోని సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరం, మ్యూజిక్ అకాడమీలో వేసవి భక్తి సంగీత శిక్షణా శిబిరం ఉత్సాహంగా ప్రారంభమైంది. అకాడమీ డైరెక్టర్ వసుధా మూర్తి, ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరీభట్ల లక్ష్మణమూర్తి, వర్ధమాన గాయనీమణులు నందిని, యామిని ఓత్సాహికులకు మ్యూజిక్ (గాత్రం), కీ బోర్డు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణనిచ్చారు. మే 27 వరకు శిక్షణా తరగతులు కొనసాగుతాయని అకాడమీ డైరెక్టర్ వసుధా మూర్తి తెలిపారు.

'బీజేపీకి ప్రచారం తప్ప అభివృద్ధి పట్టదు'

అంబర్‌పేట: బీజేపీ ప్రభుత్వానికి ప్రచార యావా తప్పా అభివృద్ధి పట్టదని బీఆర్ఎస్ అంబర్‌పేట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం 6వ నెంబర్‌లోని ఆయన నివాసంలో మాజీ కార్పొరేటర్లు పద్మావతిరెడ్డి, పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, దూసరి శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి మాట్లాడారు. చేవెళ్లలో జరిగిన బీజేపీ సభలో కేంద్రమంత్రి అమిత్‌షా కుటుంబ పాలన, పరీక్ష పేపర్ల లీకేజీలపై తప్ప తెలంగాణ అభివృద్ధిపై మాట్లాడకపోవడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ అభివృద్ధికి సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంటే బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనను చూసి బీజేపీ నేతలు నేర్చుకోవాల్సింది అవసరం ఎంతైనా ఉందని హితవు పలికారు.



మాట్లాడుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు

ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



వెంకటేశ్వర్ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

కాచిగూడ: ముదిరాజ్‌ల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతం కృషి చేస్తున్న 'ఆల్ ఇండియా ముదిరాజ్ కోలీ సంఘం' ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకటేశ్వర్ అందిస్తున్న సేవలను గుర్తించి ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. అవార్డులు, సత్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా వేయికోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు ఇస్తున్న 25 శాతం రిజర్వేషన్లలో మా వాటా మాకు ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను ఒప్పుకుని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వారి ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కాసాని వీరేష్ ముదిరాజ్, భాను ప్రకాష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం



నృపతుంగలో శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: కర్నాటక శిక్షణా సమితి ఆధ్వర్యంలో కాచిగూడలోని నృపతుంగ విద్యాలయంలో సోమవారం వేసవి శిక్షణా తరగతులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1928లో స్థాపించిన నృపతుంగ విద్యా సంస్థలు జంట నగరాల ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. లక్షలాది మంది పిల్లలకు చక్కటి విద్యతో పాటు మంచి భవిష్యత్తును అందించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత కర్నాటక శిక్షణ సమితికి ఉందని ప్రశంసించారు. కర్నాటక శిక్షణ సమితి అధ్యక్షుడు రాంమోహన్, ప్రహ్లాద్ జోషి, ముకుంద్ కులకర్ణి, సురేందర్ కులకర్ణి, పరిమళ కులకర్ణి, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: నడిచే పద్యంగా ప్రశస్తి పొందిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య 103వ జయంతి మహోత్సవాన్ని ఈ నెల 29న సాయంత్రం శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో వైభవంగా నిర్వహించనున్నట్లు రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి ఆచార్య ఫణీంద్ర తెలిపారు. ఆయన కుటుంబసభ్యుల సమక్షంలో పీఠం అధ్యక్షులు కళ్లెపు సాగరరావు సోమవారం సాయంత్రం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన నండూరి రచనల్లో పలు విమర్శన గ్రంథాలు ప్రముఖంగా పేరు పొందాయి. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధకృష్ణన్ నుంచి తెలుగు భాషా సమితి పురస్కారం అందుకున్నారు. ఆయన రాసిన గాంధీయన్ ఎరా గ్రంథానికి నాటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ ముందుమాట రాశారు. కరుణశ్రీ, నండూరి ఆత్మీయమిత్రులు, కరుణశ్రీ ఈ రచనలన్నింటికీ నండూరి వారే పీఠికలు రాశారు. ఈ ఏడాది సినీ కవి రసరాజుకు నండూరి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు సమావేశకర్త వేమరాజు విజయకుమార్ ప్రకటించారు.

బీసీ వ్యతిరేకి బీజేపీని సాగనంపుదాం



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

రాంగోపాల్‌పేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ కుల జనగణన చేపట్టకుండా బీసీ వ్యతిరేఖ ధోరణి అవలంభిస్తుందని సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్ ఆరోపించారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల జనగణన చేపట్టని బీజేపీ ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్లు తొలగించి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అందిస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత కొన్ని నెలలుగా ప్రగతిశీల పార్టీలు బీసీ కుల గణన కోసం పోరాటాలు చేస్తున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇది సాధ్యం కాదని కుల విభజనకు దారితీస్తుందని సుప్రీం కోర్టుకు లేఖ రాసిందన్నారు. దేశ జనాభాలో 50 శాతం పైబడ్డ ఉత్పత్తి కులాలకు సంబంధించిన హక్కులు, అధికారాలను కాలరాస్తూ శాశ్వతంగా బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం వేగవంతం చేసిందని విమర్శించారు. నూతన విద్యావిధానం పేరుతో దేశంలో అట్టడుగు వర్గాల ప్రజలకు విద్యను దూరం చేయడమే కాకుండా భారత రాజ్యాంగం కల్పించిన చదువుకునే హక్కును కాలరాసే కుట్రలను బీజేపీ ప్రభుత్వం పన్నుతుందన్నారు. కాంపల్లి శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు కొమురెల్లి బాబు, కల్యాణ్, పవన్ పాల్గొన్నారు.